


(18వ భాగము)

మళ్ళీ తుపాకులు గురి చేశాం ఇద్దరం.

కనీసం ఇద్దరన్నా చనిపోయి వుండాలనుకున్నాను.

వాళ్ళూ బాణాలు వదలటం మొదలెట్టారు. ఒకటి నా చెవి ప్రక్కనుంచి 'ఝుంయ్' మని దూసుకుంటూ మాకు వెనుకవేపు వున్న నీళ్ళలో పడింది. ఇంకొకటి డెల్లా ప్రక్కన పెట్టుకున్న సంచీలోకి వచ్చి దూరింది.

ఈ బాణాలు చాలా ప్రమాదకరమైనవన్న విషయం నాకు తెలుసు. వాటి మొనలకు విషం పూస్తారు. అవి గనుక శరీరానికి తగిలాయంటే క్షణంలో చావు తప్పదు

జాగ్రత్తగా వుండమని డెల్లాను హెచ్చరించాను.

ఇద్దరం కాల్పులు నిర్విరామంగా కానిచ్చాం.

సగం మందికి పైగానే చనిపోయారు. మిగిలిన డింగీలు ముందుకు రావడం మాని వెనక్కి పోతున్నట్లు, చీకట్లోనే పసిగట్టాను.

మా దగ్గర తూటాలు అయిపోయాయి. డింగీలు తిరుగు ముఖం పట్టడంతో కాస్త ధైర్యం వచ్చింది.

"ఈ గండం గడిచినట్లుంది" అంది డెల్లా.

"ఆc! గట్టెక్కే మార్గమే ఆలోచించాలి." అన్నాను.

"చిన్నగా వెళ్ళి కొండ వద్దకు చేరుకుందాం. మన అదృష్టం బావుంటే ఏదన్నా స్టీమరు రావచ్చు. దాంట్లో చెక్కేద్దాం" అంది డెల్లా.

"తొందరపడి పోవడం ప్రమాదం. వాళ్ళింకా అక్కడే వున్నా వుంటారు. మనం యీ డింగీలో సముద్రం దాటలేమని తెలుసుకొన్నారు. మనకున్న మార్గమల్లా అక్కడ నుండి ఏదన్నా స్టీమరు పట్టుకోవడం అని కూడా తెలుసు" అన్నాను.

"అయితే ఏం చేద్దాం?"

"భగవంతుడిపైన భారం వేసి ఈ డింగీలోనే ముందుకు వెళ్దాం!" అన్నాను.

"ఇంత పెద్ద సముద్రాన్ని, ఈ డింగీతో దాటి ప్రాణాలతో గట్టు చేరతామనేనా నీ నమ్మకం?" వింతగా చూస్తూ అడిగింది డెల్లా.

"ప్రయత్నిద్దామనుకుంటున్నాను. మనం చావాలని రాసిపెట్టి వుంటే తప్పించుకోలేం. నీకు ధైర్యంగా వుంటే చెప్పు, వెళ్దాం" అన్నాను.

కాసేపు మౌనంగా చుట్టూ వున్న చీకటిని, కనుమాపు మేరదాకా కనుపిస్తున్న సముద్రాన్ని తదేకంగా చూస్తూ

కూర్చుంది డెల్లా. నోటమాట రాలేదు. తెలిసీ తెలిసి మృత్యువు దగ్గరకు పోతున్నట్లుగా నాకూ అనిపించింది. కానీ అంతకన్నా వేరే దారేది కనుపించలేదు.

"ఏమంటావ్?" హెచ్చరించాను డెల్లాను.

"నీ యిష్టం!" అంది మెల్లగా.

డింగీని బరువు సరిగ్గా వుండేట్లు సంచుల్ని సర్ది, నేను కూడా సర్దుకొని కూర్చున్నాను. తెడ్లుతీసి మెల్లిగా కదపడం ప్రారంభించాను. మెల్లగా నీటి తెరను చీల్చుకుంటూ కదలసాగింది మా డింగీ.

డెల్లా కూడా తెడ్లు వేసేందుకుద్యుక్తురాలైంది. వద్దని వారించాను. ఇద్దరం ఉన్న శక్తినంతా ఒకేసారి ఖర్చు చేసుకోవడం నా కిష్టం లేదు. ఒకరి తర్వాత ఒకరు తెడ్లు వెయ్యడం మంచిదనిపించింది. ఒకరు అలిసిపోయేలోగా మరొకరు బలం పుంజుకోవచ్చు.

సముద్రం పైన తెల్లవారింది. ఎర్రటి సూర్యకిరణాలు నీలం రంగు నీళ్ళపైబడి, పసుపు రంగు కాంతిని చుట్టూ పరిచాయి. ఆ దృశ్యం మనోహరంగా వుంది. డెల్లా నిద్రలో వుండిపోయింది. వెలుతురు తెలుపెక్కింది. కను చూపు మేరదాకా కళ్ళు చీల్చుకుని చూశాను.

నీళ్ళు తప్ప మరేం కనుపించలేదు. మాకాశ్రయం ఇస్తుందనుకొన్న కొండ కూడా కనుపించలేదు. అంటే దానినుండి మేము చాలాదూరం వచ్చేసి వుండాలను కున్నాను.

"ఇనుప కటకటాల ఇరుకు 'ఖైదు' మనిషి సృష్టించాడు. గోడలులేని, ఓడలు దొరకని ఈ ఖైదు ప్రకృతి సృష్టించింది మాకు" అనుకున్నాను.

డెల్లా కళ్ళు తెరిచింది. ఇద్దరం సముద్రపు నీళ్ళు పుక్కి-
లించి ఉమ్మి, సంచీలో తెచ్చుకొన్న ఆహారం కొద్దిగా
తిన్నాం. కాస్త విస్కీ కూడా పుచ్చుకుని సిగరెట్లు వెలి
గించాం. మావద్ద మిగిలిన ఆహారం మరో రెండు దినాలకు
సరిపోతుంది. ఆ తర్వాత ఆకలికి చావక తప్పదు.

"ఈ ఆహారం అయిపోయేలోగా మనం గట్టు జేరు
కుంటామా?" అడిగింది డెల్లా సిగరెట్ దమ్ములాగి
వదుల్తూ.

"ఆఁ! జానపద కథల్లోలాగా ఏదైనా పక్షి ఆకాశంలో
ఎగురుకుంటూ వచ్చి, మనల్నిద్దరినీ ఎక్కించుకొని పోతే
తప్ప, గట్టెక్కే అవకాశం కనుపించడంలేదు!" అన్నాను
తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో.

"మా ఇంటినుండి బయలుదేరిన క్షణాలు అంతమంచివి
కావు. అంతా కష్టాలే! బాధలే!!" అంది డెల్లా.

"నాకూ అంతే!" అన్నాను.

"ప్రతి సముద్రంలోనూ అమెరికాదేశపు నౌకాదళాలు
కాపలాగా పెట్టి వున్నారని పేపర్లో చదివా నొకసారి.
అలాంటి వేమన్నా ఈ సముద్రంలో వుండే అవకాశం
లేదా?" ప్రశ్నించింది డెల్లా.

నాకూ ఆ విషయం గుర్తొచ్చింది. చాలాసార్లు నేను
కూడా చదివాను. సముద్రజలాల్ని కాపలాకాస్తూ, విరోధి
కూటమికి చెందిన నౌకలు రాకుండా చాలా పెద్ద బలగాన్ని
ప్రతి సముద్రంలోనూ పెట్టారు అమెరికన్లు. ఆ బాపతు
నౌక లేవన్నా కనుపించే అవకాశం వుంది. ఆ ఆశ నాలో
క్రొత్త ఉత్సాహాన్ని ధైర్యాన్ని కలిగించింది.

డింగీని ఇద్దరం వేగంగా ముందుకు నడపసాగాము. ఆ
పగలంతా శ్రమపడి చాలాదూరం ముందుకో, వెనక్కో,

ప్రక్కకో తెలీనివిధంగా నడిపాం. సముద్రం ప్రశాంతంగా వున్నందువల్ల, డింగీని ముందుకు నడపడం నాకేం కష్టంగా అనిపించలేదు.

చీకటిపడింది.

అంతదాకా ఉప్పగా ఎండిపోయినట్లు వీచినగాలి, చల్లగా మారింది. గాలిలో తేమకూడా కాస్త ఎక్కువగా వున్నట్లుతోచింది. వాతావరణంలో ఉన్నట్టుండి వచ్చిన ఆ మార్పు నన్ను కాస్త కలవరపెట్టింది. బహుశా సముద్రం పైన మాకు కాస్త దూరంగా, విపరీతంగా వర్షం కురుస్తూ వుండాలనుకున్నాను. ఆ వర్షం మమ్మల్ని నిలువునా సముద్రంలో ముంచివేసే ప్రమాదముంది.

తెడ్లు వెయ్యడం ఆపేశాను. డెల్లాకు విషయం చెప్పాను.

విని ఆమెకూడా భయపడింది.

డింగీ అసలే చిన్నది. దానికి తోడు చాలా తేలికైంద గూడా. నీళ్ళలోతూ ఎక్కువగాబట్టి, విసురుగా, గాలి వేస్తే ఎంత కంట్రోలుచేసినా ఆగదు. బోల్తాకొట్టి బోరగిల పడుతుంది.

"ఏంచేద్దాం?"

"ఆఖరి ప్రార్థన చేసుకుని కళ్ళు మూసుకుందాం. కనీసం కలిసి వచ్చే అవకాశం భగవంతుడు మనకు కలిగించినందుకు ఆనందిద్దాం!" అన్నాను.

డింగీని కదలిక లేకుండా చేసేందుకు తెడ్లు వెయ్యడం మానేశాం. వర్షం రాకకోసం చెవులు రిక్కించుకొని, శబ్దాలు వింటూ ఎదురుచూడసాగాం.

దూరంగా ఎక్కడో నీళ్ళను కత్తితో మధ్యకు విసురుగా నరుకుతూన్న శబ్దం వినిపించింది. దృష్టినంతా

కేంద్రీకరించి విన్నాను. శబ్దం కాబోతున్నట్లుగా వుంది. మా డింగీ మెల్లగా అటూ ఇటూ కదలడం పసిగట్టాను. తొంగి నీళ్ళపైకి చూశాను. పెద్దపెద్ద కెరటాలు వస్తున్నాయి మా డింగీ వైపు.

అప్పటిదాకా ప్రశాంతంగా వున్న సముద్రంలో అలజడి అకస్మాత్తుగా ఎందుకు ప్రారంభమైందాని అదిరిపోయాను. అలాంటి అలజడికి మామూలుగా తిమింగలాలు కారణమవుతూ వుంటాయి. తిమింగిలం నీళ్ళలోనే వస్తూంది. అది గాలి వదిలేసరికి, దాని స్పీడుకు నీళ్ళు పదడుకులెత్తున అలల్లా లేస్తాయి. కాస్త వొళ్ళు విరిచిందంటే దాని వీపు నీళ్ళపైకి లేస్తుంది. ఆపని డింగీ దగ్గరికొచ్చాక చేసిందంటే ఇద్దరం సముద్రం పాలవుతాం. దాంతో మా వాసన పసిగడుతుంది. అంతే ఇద్దర్నీ ఒక్కసారి మింగుతుంది. ఆపైన ఆలోచించలేక పోయాను.

నా అనుమానం డెల్లాకు చెప్పాను.

తిమింగిలం మాట వినగానే, మనిషి బిగదీసుకుపోయింది.

"తప్పించుకొనే మార్గం చూడు!" అంది డెల్లా.

"దాన్ని చంపేదా?" అన్నాను పెద్ద వీరుడిలా.

"ఎలా?" అడిగింది.

"సింపుల్! దాని నోట్లోకి దూకుతాను. అక్కడ్నుంచి పొట్టలోకి చేరుకుంటాను. అక్కడ కాళ్ళతో చేతుల్తో కుమ్మి చంపుతాను" అన్నాను.

"తమాషాలు చెప్తున్నావా?"

"కాకుంటే ఇంకేం చెప్పేది?" అడిగాను.

విస్కీ బాటిల్ సంచీలోంచి లాగి గడగడ త్రాగింది. సగంపైగానే పూర్తి జేసింది.

"ఎందుకలా అంతా కాజేస్తున్నావ్?" కోపంగా చూస్తూ ప్రశ్నించాను.

"చచ్చాక ఇవన్నీ ఎందుకూ ఉపయోగపడవ్. అందుకే అన్నీ పూర్తి జేసి పారేద్దాం!"

"ఆ తర్వాత అదృష్టంకొద్దీ చావకుండా బ్రతికితే... నోట్లో వ్రేళ్ళు పెట్టుకోవలసిందే!"

"అదృష్టం!... ఎలా వుంటుంది?... ఎక్కడుంటుంది?... అలాంటిదంటూ వుంటే ఇలా అడుగడుక్కీ ప్రతిచోట, ప్రతినిమిషం, మనం పరిస్థితులకో, మనుషులకో, వాతావరణానికో, ప్రకృతికో, దేనికో ఒకదానికి ఖైదీలుగా చిక్కిపోతామంటావా? ఈ నిరంతర పోరాటం కన్నా ఒకరకంగా నువ్వు వస్తుందంటున్న చావు మేలు. ఈ తిమింగిలం చేతుల్లో చచ్చినా ఒక్కటే! లేదా అటు వేపునుండి వర్షం మనల్ని వచ్చి ముంచేసినా ఒక్కటే!" అంది డెల్లా విస్కీబాటిల్ నోటికి కరిపించుకుంటూ.

చావు నిశ్చయమనీ, తప్పించుకొనే దారిలేదని తెలిశాక మనిషికి దానంతటదే వేదాంతం పుట్టుకొస్తుందనడానికి డెల్లా మాటలే చాలనిపించింది.

మా ఇద్దరి జీవితాలకు ముగింపు ఆసన్నమైంది. ఆమెను ఎలాగైనా సురక్షితంగా, ఆమె దేశం చేర్చాలనీ, వాళ్ళ వాళ్ళకు అప్పజెప్పాలని, కన్నకలలన్నీ కలలుగానే మిగిలిపోతున్నాయి. నాకు నాదేశం చేరాలనీ, చేసిన తప్పులకు శిక్ష అనుభవించి, ఆ తర్వాత పుట్టిన గడ్డపై మిగిలిన జీవితం పూర్తి జేసుకొని ఆ మట్టిలో కలిసిపోవాలనీ వుండింది. అది నిరాశగానే మిగిలిపోయింది.

దూరంగా, ఎంతో దూరంనుంచి లీలగా, సన్నటి

గోలగా వినిపించిన అలజడి, ఇప్పుడు స్ఫుటంగా, స్పష్టంగా, వినిపించసాగింది దగ్గరలో.

తిమింగిలాలగురించి నేను చదివింది లేదు. అవి సముద్రంలో శక్తివంతమైన స్టీమర్లకన్నా వేగంగా ప్రయాణించ గలగాలి. ఆ లెఖనచూస్తే, మొదట నేను అనుమానించి నప్పటినుండి, ఇంతదాకా దాదాపు, అరగంట గడచింది. తిమింగలాలచే ఈమాత్రం దూరం రావడానికే అరగంట పట్టడం 'అప్సర్డ్' అనిపించింది. కాకుంటే మరేంటాని ఆలోచించాను. నా మెదడుకు మరేమీ తట్టలేదు. ఏదైనా ముసలి తిమింగిలం కాబోలనుకున్నాను. అదీగాకుంటే దెబ్బ తిని గాయపడన్నా వుండాలనిపించింది.

"దగ్గర కొస్తున్నట్లుంది!" అంది డెల్లా నీళ్ళకేసి చూసి.

"ఆఁ!" అన్నాను నేనుగూడా గమనించి చూసి.

నామాట పూర్తిగాక ముందే, సముద్రం మా ముందు కల్లోలమైపోవడం, నీళ్ళు చుట్టలు చుట్టుకోవడం చూశాను. డెల్లాతో నన్ను ఘట్టిగా పట్టుకోమన్నాను. మా ఇద్దరికీ ఈదడం వచ్చు.

మా డింగీ క్రిందనుండి అలలు పుట్టుకొచ్చాయి. అది బోల్తాకొట్టకుండా మా బరువుని చకచక అటూ ఇటూ అతివేగంగా మార్చసాగాం. రెండు నిమిషాలకన్నా ఎక్కువ ఆపలేకపోయాం.

డింగీ అడ్డం తిరిగింది. బోల్తా కొట్టింది. ఇద్దరం నీళ్ళలో పడ్డాం. మామీద గొడుగులా పడింది డింగీ. మేము తెప్పరిల్లి తేలాలన్న ప్రయత్నం చేసేలోగా ఐదారుగజాలు నీళ్ళ లోకి మునిగిపోయాం. నా కాళ్ళకు నున్నటి లోహం

తగిలింది. అది తిమింగలం చర్మం కావడానికి వీల్లేదు. దాని పైన నిలుచున్నాను. నా స్పర్శాజ్ఞానం మేల్కొంది. అది లోహపు ఉపరితలంలా వుంది.

రెండు నిమిషాల్లో మా ఆకారాలు పైకొచ్చాయి. కాళ్ళక్రింద ఏదో ఆదరువుంది.

కళ్ళు తెరిచాను.

"మన కాళ్ళక్రిందేమిటి?" అడిగింది డెల్లా ఆశ్చర్య పోతూ.

వొంగి చూశాను. తెల్లగా కనుపించింది. అల్యూమిని యంలా వుంది. అంతే! నా ఆనందానికి అంతులేదు. అది తిమింగిలం కాదు. ఏదో సబ్ మెరైన్. దాని ముందున్న గుండ్రటి భాగం నీళ్ళపైకి లేచింది. కాంతివంతమైన లైటు వెలిగింది. సముద్రంలోని కొంత భాగం పట్టపగలులా మారి పోయింది.

ఇంకొంత సేపటికి సబ్ మెరైన్ మొత్తం నీళ్ళపైకి వచ్చింది. పైనున్న డోర్ తెరుచుకుంది. ఒకతను మిలిట్రీ యూనిఫాంలో వున్నాడు. పైకొచ్చి,

"లోనికి రండి!" అన్నాడు, అమెరికన్ స్లాంగ్ లో వున్న ఇంగ్లీషులో.

మారు మాట్లాడకుండా అతనివెంట లోనికి దిగాం. మా వెనకనే లావుపాటి బలమైన మెకాతో చేసిన తలుపు దక్కున మూసుకుంది.

నావిగేటింగ్ వీల్ దగ్గర ఇద్దరు కూర్చుని వున్నారు. మమ్మల్ని ఓ మారు తలత్రిప్పి చూసి ఆ తర్వాత మళ్ళీ వాళ్ళ పనిలో యధాప్రకారం మునిగిపోయారు.

అక్కడ్నుంచి మరో అంతస్తు క్రిందకు దిగాం. విశాల మైన హాలులా వుంది. లైట్లు వెలుగుతున్నాయి. కుర్చీలు

చుట్టు వేసివున్న డైనింగ్ టేబుల్ లాంటి దాంతో ఖరీదైన హోటల్‌ను గుర్తుకు తెచ్చిందా గది.

ఎడంవేపుగా వున్న తలుపు చూపిస్తూ, "లోని కెళ్ళి, వాష్ చేసుకొని రండి. వెయిట్ చేస్తుంటాను" అన్నాడు అతను.

ఇద్దరం తలుపు త్రోసుకొని లోనికెళ్ళాం. అందమైన చిన్నగది. ఒకటే బెడ్ వుంది.

తలలు తుడుచుకున్నాం. మొహాలు టాప్ దగ్గర కడుక్కొన్నాం. నీళ్ళు తియ్యగా వున్నాయి. ఆత్రంగా టాప్‌ను నోటికి పెట్టుకొని త్రిప్పి త్రాగాను రెండు నిముషాలు కడుపునిండేట్టుగా.

వేరేబట్ట లేకున్నా వేసుకొనేందుకు వీలుంటుందేమోనని చూశాను. ఏవీ కనుపించలేదా గదిలో.

ఇద్దరం వెలుపలకొచ్చాం.

"ఆడవాళ్ళ బట్టలు మా దగ్గర లేవు. ఈ యూనిఫాంలు వేసుకోండి!" అంటూ టేబుల్ పైనమాకోసం పెట్టిన బట్టల్ని, తనచేతిలో వున్న వెండిపాన్ను బొత్తంతో చూపించాడు అతతలవేపు నిలుచుని.

లైటు వెలుతురు క్రింద నిలుచున్న అతన్ని చూశాను. ఆరడుగుల ఆజానుబాహు విగ్రహం. తెల్లటి హాఫ్‌పాంటు, షర్టు టక్ చేసుకొన్నాడు. హాఫ్‌పాంటు మడత స్టిఫ్‌గా వుంది కత్తి మొనలా. మోకాళ్ళదాకా సాక్సు తొడుక్కొన్నాడు. నల్లటి బూట్లు నిగనిగ మెరుస్తున్నాయి. ఎడంచేతిలో గోల్డుకలర్ వాచ్ కట్టుకున్నాడు. క్రమశిక్షణ, ధైర్యం, సాహసం మూర్తీభవించినట్లున్నాయి అతని రూపంలో.

యూనిఫాంలు తీసుకుని ఇద్దరం గదివేపు వెళ్ళబో తూంటే అతను నవ్వాడు.

ఠక్కున వెనక్కి తిరిగాను.

"ఇద్దరూ ఒకేసారి మార్చుకుంటారా?" అడిగాడు అతను నవ్వుతునే.

నాకూ నవ్వొచ్చింది. ఆడ మగా మరచిపోయి సాగించిన జీవితం గురించి అతనికి తెలీక అలా అన్నాడని నా కర్థ మయినా, డెల్లాను లోనికి వెళ్ళమని నేను అక్కడే నిలు చున్నాను.

"నా పేరు రాజ్!" అన్నాను నన్ను నేనే పరిచయం చేసుకొనే ప్రయత్నం చేస్తూ.

"ముందు బట్టలు మార్చుకోండి. ఆహారం తీసుకోండి. ఆ తర్వాత మీ మంచి చెడ్డలు వివరంగా చెప్పండి. వింటాను" అన్నాడు తాపీగా. మాగురించి తెలుసుకోవా లన్న ఆతృత అతనికి ఎందుకు కలగటం లేదో అర్థం కాలేదు నాకు. అక్కడే నిలుచున్నాను. అతను వెళ్ళి పోయాడు మెట్లెక్కి పైకి.

అతను కనుమరుగు కాగానే, డెల్లా కోసం చూశాను. రెండు నిముషాల తర్వాత వెలుపలి కొచ్చింది. ఈమారు ఆమె వేసుకున్న దుస్తులు చూచి నవ్వాపుకోలేకపోయాను లావాటి వ్యక్తి తాలూకు యూనిఫాం కావటంతో హాఫ్ పాంటుతోపాటు, షర్టు కూడా బాగా లూజుగా వుంది. డ్రాయరు, బ్రా లేకపోవటంతో తెల్లటి షర్టులోంచి ఆమె వొంటి రంగు కనుపించసాగింది. నడుం చుట్టూ రెండు చేతులూ గట్టిగా పట్టుకుని వచ్చింది.

"ఏంటలా చేతుల్తో పాంటుని పట్టుకున్నావ్?" అడిగాను.

"లూజుగా వుంది. వేద్దామంటే బెల్టు కూడా లేదు! జారిపోతుంది!" అంది.

"బకిల్సు వెయ్యాకపోతివా?"

"చూశాను. అదీ లాభం లేదు!" అంది.

"ఇక్కడే వుండు నేను బట్టలు మార్చుకొని వస్తాను. ఆ తర్వాత బెల్టు కోసం ట్రై చేద్దాం!" అని లోనికి వెళ్ళాను.

నా డ్రెస్ ఒక మోస్తరుగా సరిపోయింది. కాస్త లూజుగా వున్నా జారిపోయే ప్రమాదం లేదు. వెలుపలికొచ్చాను. డెల్లా అలాగే నిలుచుని వుంది.

"పద! పైకి వెళదాం!" అన్నాను.

ముందు నేనూ, నా వెనుక డెల్లా ఇద్దరం మెట్లెక్కి పైకొచ్చాం.

నాతో అంతకు ముందు మాట్లాడిన ఆఫీసరు కోసం అటూ ఇటూ చూశాను. అతను కనుపించలేదు. నావిగేటర్లు నా చూపులు చూచి ఎదురుగా వున్న డోర్ కేసి చెయ్యి చూపించారు వెళ్ళమన్నట్లు.

వాళ్ళు చూపించిన వైపు డోర్ వద్దకు వెళ్ళి నెట్టాను. ఆ తలుపు తెరుచుకొంది. విశాలమైన గది మధ్య, రాంగు ఛెయిర్‌లో కూర్చున్న అతను కనుపించాడు.

"కమాన్ మై ఫ్రెండ్!" నన్ను చూస్తూనే ఆహ్వానించాడు.

ఇద్దరం లోనికి వెళ్ళాం.

రెండు చిన్న మోడాల్లాంటివి చూపించాడు కూర్చోమని. వాటిపైన కూర్చున్నాం.

"బట్టలు సరిపోయాయా?" అడిగాడు.

"ఆఁ! నాకు సరిగానే వున్నాయి. ఈమెకు కాస్త లూజుగా వున్నాయి. బెల్టులాంటి దేదన్నా వుంటే బావుంటుంది" అన్నాను.

"మా సబ్‌మెరైన్‌లో ఆడవాళ్ళ బట్టలుండవు. బెల్టులు కూడా వుండవు" అంటూ డ్రాయరు లాగి అందులోంచి వెడల్పాటి టేప్ తీసిచ్చాడు. అది అందుకుంది డెల్లా. కూర్చునే కట్టుకుంది నడుం చుట్టూ.

"యస్! ఇప్పుడు చెప్పండి. ఎవరు మీరు? ఈ సముద్రంలోకి ఎలా వచ్చారు? ఆ డింగీలో ఎక్కడికి వెళ్ళాలని ప్రయత్నం చేస్తున్నారు?" అడిగాడు అతను.

మా కథంతా క్లుప్తంగా చెప్పాను చకచక. అంతా విన్నాడు. డెల్లాకేసి చూశాడు.

"ఎక్సైటింగ్ స్టోరీ!" అన్నాడతను.

"ఇది స్టోరీ కాదు! జరిగిందే!" అన్నాను అతని మాటల్ని కరెక్టు చేస్తూ.

"అయితే మీరు ఏ దేశానికో సంబంధించిన గూఢచారులనుకొన్నాం. మా సబ్‌మెరైన్‌ల గురించి, ఫ్లీట్ గురించి వివరాలు సేకరించేందుకొచ్చి ప్రమాదంలో చిక్కుకుని పోయారని మావాళ్ళూహించారు" అన్నాడు అతను.

అతని పేరు కెప్టెన్ 'షివర్లీ' అని తర్వాత తెలుసుకున్నాను. అమెరికన్ సిక్స్త్ ఫ్లీట్‌లో పని చేస్తున్న పెద్ద అధికారని కూడా గ్రహించాను.

"మేము గూఢచారులం కాదు" అన్నాను నేను.

"ఎలా నమ్మాలి?" నవ్వుతూ అడిగాడు షివర్లీ.

"నేను ఇండియన్‌ను. ఆమె బ్రిటిష్ దేశస్థురాలు. మా ఆకారాల్ని బట్టి ఆ మాత్రం సులభంగా గ్రహించగలరను

కుంటాను. మా రెండు దేశాలు మీకు మిత్ర దేశాలే! అటువంటప్పుడు మేము గూఢచారులం అయ్యే ప్రసక్తి లేదు!'' కొంత ఒప్పించే ధోరణిలో సాగింది నా వాదన.

''కరెక్టు! మీ దేశాలు మాకు మిత్రదేశాలయినంత మాత్రాన మీరు మాకు మిత్రులని నమ్మడం అసాధ్యం. నిజానికి మా దేశంలో మావాళ్ళే, చాలా మంది డబ్బుకు ఆశపడి, పొరుగు దేశాల తరఫున గూఢచారుల్లా పనిచేసి, పట్టుబడిపోయిన సంఘటనలు కోకొల్లలున్నాయి'' అన్నాడు షివర్లీ.

అతను చెప్పింది కూడా నిజమే! అలాంటి వెన్నో కథలు పేపర్లలో చదివాను కూడా.

''అయితే మిమ్మల్ని నమ్మించేందుకు మేమేం చెయ్యాలి చెప్పండి!'' అన్నాను.

''మీకా శ్రమ అవసరం లేదు. ఇక్కడ్నించి మిమ్మల్ని దరినీ మా బేస్‌కు తీసుకుపోతాం. అక్కడ నా పై అధికారులకు మిమ్మల్ని అప్పజెపుతాను. ఆ తర్వాత ఏం చెయ్యవలసిందీ వాళ్ళే ఆలోచించుకుంటారు'' అన్నాడు షివర్లీ.

అంటే మేము మళ్ళీ ఖైదీలమయ్యామన్న మాట! డెల్లా నా వేపు భయంగా చూసింది.

''మీరిద్దరూ భోజనం చేస్తారా?'' అడిగాడు షివర్లీ.

''ఇప్పుడు ఆకలిగా లేదు! తర్వాత తింటాం!'' అన్నాను నేను.

''అయితే ఇందాక చూపించిన గదిలోకి వెళ్ళి రెస్టు తీసుకోండి! ఆ గది మీకు సౌకర్యంగా వుంటుందికదూ!'' అడిగాడు,

"చాలు! సర్దుకుంటాం!" అన్నాను.

ఇద్దరం అక్కడ్నించి దిగి క్రింది హాల్లోకి వచ్చాం. టేబుల్ ప్రక్కనుంచి అంతకు ముందు బట్టలు మార్చు కున్న గదిలోకి వెళ్ళాం.

అనుమానపు పరిస్థితుల్లో మిలిట్రీవాళ్ళ చేతబడగూడ దెవ్వరు. పడ్డాక ఎంత కాదని తల మొత్తుకున్నా వాళ్లు వినరు. నిజం చెప్పించడమనే సాకుతో నానాయాతనలు పెడతారు. ఆ నిజం మనం చెప్పేది కాదనీ, వాళ్లు కోరే నిజం మాత్రమే నిజమని అభిప్రాయ పడతారు.

వాళ్ళు పెట్టే యమయాతనల గురించి నేను చాలా సార్లు విన్నాను. పుస్తకాల్లో చదివాను. అందుకే కంప రంగా వుంది.

"ఈ సబ్ మెరైన్‌లో అన్ని సౌకర్యాలూ వున్నాయి. మంచి గాలి వస్తూంది. తియ్యటి నీళ్ళు దొరుకుతున్నాయి. లైట్లు వెలుగుతున్నాయి. బాత్‌రూం వుంది. ఇవన్నీ ఎలా అమర్చారో..." అంది డెల్లా ఆశ్చర్యపోతూ.

"ఇంతకన్నా గొప్ప ఘనకార్యాలు సాధించాడు మనిషి శాస్త్రపరిశోధనతో" అన్నాను ఎటో చూస్తూ.

"ఏమిటో ఆలోచిస్తున్నావ్? నా మాటలు సరిగా విన్నట్లు లేదు!" అంది మళ్ళీ డెల్లా.

"ఏం లేదు! మనల్ని వీళ్ళు ఏం చెయ్యబోతారా అని ఆలోచిస్తున్నాను."

"ఏమీ చెయ్యరు. గట్టు చేరంగానే మీ త్రోవన మీరు పొమ్మని వదిలేస్తారు."

"ఎలా చెప్పగలవ్?"

"లేకుంటే మనల్ని వెంటేసుకుని, అంటిపెట్టి, సప్త సముద్రాలూ తమతో త్రిప్పుతారనుకున్నావా?"

"అనుకోలేదు," అన్నాను.

ఆమెకు నాకు తెలిసిందిగానీ, నా ఊహలుగానీ చెప్పడం ఇష్టం లేదు. దాంతో బెంబేలెత్తిపోతుందన్న అనుమానం కూడా కలిగింది నాకు.

ఇద్దరం అడవి గురించీ, అక్కడి మనుషుల గురించీ, నా వెంటబడ్డ ఆడమనిషి గురించీ చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. ఆ ఆడమనిషి మాటెత్తినప్పుడు మాత్రం డెల్లా కళ్ళలో అసూయ, కోపం కనుపించాయి. తలుపు తట్టిన శబ్దమైంది.

నేను లేచి వచ్చి తలుపు తీశాను.

ఎదురుగా షివర్లీ నిలుచుని వున్నాడు. అతని ఎడం చేతిలో పైపు సన్నగా కాలుతూంది.

"భోంచేద్దాం! రండి" అన్నాడు.

ఇద్దరం వెలుపలకొచ్చాం.

టేబుల్ చుట్టూ డజను కుర్చీలున్నాయి. మొత్తం యూనిఫాంలో ఆరుగురున్నారు. రకరకాల టిన్నులు చిన్నవీ పెద్దవీ టేబుల్ పైన పెట్టున్నాయి.

ఒకతను కత్తితో ఒక్కొక్క టిన్నే ఓపెన్ చెయ్య సాగాడు.

మా ముందున్న ప్లేట్లలో, బ్రెడ్ ముక్కలు కొన్ని పెట్టాడు. మరో చిన్న డబ్బాలోంచి ఉడకబెట్టిన కోడి గుడ్లు, వేయించిన చాపలు, వెన్న, బఠాణీలు, మొదలైన రకరకాల సైడ్ డిష్‌లు సర్వ్ చేశాడు.

"కానీండి!" అన్నాడు షివర్లీ.

ఆ భోజనం చూస్తూంటేనే నాకు కడుపు నిండినట్లయింది. అలాంటి ఆహారం తీసుకొని ఎన్నో రోజులయింది

కూడా. గ్లాసులనిండా బీరు పోసి వుంది. అందరం ముందు బీర్ కొద్ది కొద్దిగా సిప్ చెయ్యసాగాం.

అంతకు ముందు డబ్బాలు ఓపెన్ చేసిన వ్యక్తి, వెడల్పాటి టిన్ లోంచి కొంత మిల్క్ పౌడర్ తీశాడు. దాన్ని మరుగుతున్న నీళ్ళలో వేసి కలిపాడు. సాకరిన్ సీసాలోంచి కొన్ని టాబ్లెట్లు అందులో వేసి, ఇన్‌స్టెంటు పౌడరు కూడా కలిపాడు.

కమ్మటి కాఫీ వాసన నా ముక్కుపుటాల్ని తాకింది.

"మిస్టర్ రాజ్ అండ్..." అంటూ డెల్లా వేపు చూసి ఆమె పేరు కోసం తడుముకుంటున్నట్లు ఆగాడు.

"డెల్లా!" తన పేరు చెప్పింది.

"సారీ! మీ పేరు మరచిపోతున్నాను. తృప్తిగా కావలసినంత తినండి. ఏం కావాలో మొగమాట పడకుండా అడగండి సర్వ్ చేస్తాను" అన్నాడు షివర్లీ.

సబ్‌మెరైన్ కదులుతున్న శబ్దంగానీ, ఇంజన్ పని చేస్తున్నట్లు చప్పుడుగానీ వినిపించలేదు. అంతా నిశ్శబ్దంగా వుంది.

"మీరీ సబ్‌మెరైన్‌లోనే తిరుగుతూంటారా ఎప్పుడూ...?" అడిగింది డెల్లా.

"ఆఁ! విరోధి కూటమి తాలూకు సబ్‌మెరైన్‌లుగానీ, నౌకలుగానీ, ఏజంట్లుగానీ, మా రహస్యాల్ని తెలుసుకోనేందుకు ప్రయత్నిస్తున్నాయేమో తెలుసుకోవడం మా పని. మరి తిరగకుంటే మా కర్తవ్యం ఎలా నిర్వహిస్తాం?" కాఫీ కప్పు ముందుకు లాక్కుంటూ అన్నాడు షివర్లీ.

"ఓమారు తెచ్చుకునే సప్లయిస్ ఎన్ని రోజులు సరిపోతాయి?" అడిగాను నేను.

"దాదాపు నెల రోజులు."

"నెల తర్వాత మళ్ళీ బేస్‌కు వెళ్తారా?"

"మా బేస్ కూడా సముద్రంలోనే వుంది" అన్నాడు షివర్లీ.

"మీ కేదేనా ప్రమాదం సంభవిస్తే బేస్‌లో వున్న వాళ్ళకు తెలిసే అవకాశం వుందా?" అడిగాను యధాలాపంగా.

షివర్లీ కళ్లు పెద్దవయినాయి. నావేపు అనుమానంగా, కోపంగా చూస్తూ "ఎందుకడుగుతున్నావ్? మమ్మల్ని ఏదన్నా ప్రమాదంలోకి తోద్దామని ఊహిస్తున్నావా?" ప్రతి మాటా తూచి తూచి అన్నాడు.

అతని గొంతు వినగానే నాకు కాళ్ళు వణకడం మొదలెట్టాయి. "సారీ! తెలుసుకోవాలన్న ఉత్సాహంకొద్దీ అడిగాను. అంతే!" అన్నాను నా అమాయకత్వాన్ని తెలియజెయ్యాలన్న తపనతో.

"నిన్ను నేనడిగాను. నువ్వే దేశానికి ఏజంటును కాదన్నావ్. ఏవేవో కథలు చెప్పావ్. నేనూ నమ్మాను. నీబోటివాడు ఎలాగోలా సముద్రంలోంచి బైటిపడి, తన వాళ్ళను త్వరగా జేరుకోవాలని ఆరాటపడతాడు తప్ప, అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేసి, అనవసరమూ ప్రమాదకరమూ అయిన విషయాల్లో తల దూర్చడు!" అంటూ క్షణం ఆగి "నా టెల్ మి టు వుచ్ కంట్రీ యూ బిలాంగ్" అరిచాడు షివర్లి.

"నేనింతకు ముందు మీకు చెప్పిందంతా నిజం! అందులో ఏమీ అబద్ధం లేదు! నన్ను నమ్మండి!" అన్నాను దీనంగా.

"నో! ఒకమారు నమ్మాను. నా ఐ వోంట్! నాకు నిజం కావాలి! మీరు ఏ దేశపు గూఢచారులో చెప్పండి! క్విక్!" అన్నాడు షివర్లీ.

డెల్లా ముఖం పాలిపోయింది. అయోమయంగా నాకేసి చూసింది. నాకు ఏం పాలుపోలేదు.

షివర్లీ కుర్చీలోంచి లేచి నిలుచున్నాడు.

అతని కళ్ళల్లోకి చూశాను. వాటిల్లో సాధుత్వం మాయమై క్రూరత్వం నిండుకుంది.

అర్థంగాక ఇద్దరం లేచి నిలుచున్నాం.

"మీరు నిజం ఒప్పుకోరా?" అడిగాడు షివర్లీ.

చెప్పిందే చెప్పాను మళ్ళీ.

"నావెంట రండి" అన్నాడు.

ఇద్దరం అతనివెంట క్రింది అంతస్తులోకి నడిచాం. మమ్మల్నక్కడే నిలుచుండమని చెప్పి, గదిలోకి వెళ్ళి ఖరీదైన కోలీఫ్లక్స్ ఆటోమేటిక్ ప్రింట్ కెమెరా తెచ్చాడు. దాంతో ఫోటోలు తీశాడు. బటన్ నొక్కగానే పాజిటివ్ ప్రింట్లు వెలుపలికొచ్చాయి. వాట్ని తీసుకుని రేడియో రూంలోకి వెళ్ళిపోయాడు. మమ్మల్ని అంతకు ముందు చూపించిన గదిలోకి వెళ్ళమన్నాడు మేము వెళ్ళి పోయాం. మేము లోనికి పోగానే వెలుపలినుంచి తాళం వేసినట్లు 'క్లిక్'మన్న శబ్దమైంది.

"నోరు మూసుకుని వుండాల్సింది!" అన్నాను కూర్చుంటూ.

"అవును" అంది డెల్లా.

"ఇలా దారుణంగా అనుమానిస్తారనుకోలేదు. నేనెప్పుడూ సబ్ మెరైన్ చూడలేదు. తెలియని విషయాలు

తెలుసుకుందామన్న ఉత్సాహం మన గొంతులకు ఉరి త్రాడు తగిలించేట్లుంది" అన్నాను.

"ప్రతి నిముషం మృత్యువు మనల్ని ఏదో రూపంలో అంటిపెట్టుకునే వుంటుంది. ఇన్నాళ్ళూ ఎలాగో దాని కళ్లు కప్పి తప్పించుకున్నాం. ఇంక ఆఖరి ఘడియలు దగ్గర పడ్డట్లున్నాయి. అందుకే ఇలాటి సంఘటనలు జరుగుతున్నాయి" అన్నాను.

"ఫోటోలు ఎందుకు తీసినట్లు?"

"వాటిని రేడియో ట్రాన్స్మిట్ చేస్తారనుకుంటాను బేస్కు. అక్కడ వాళ్ళ దగ్గరున్న ఏజెంట్ల ఫోటోలు దేనితోనన్నా సరిపోతాయేమో పరిశీలించి, మళ్ళీ ఇక్కడకు మెసేజ్ పంపుతారు గాబోలు!" అన్నాను.

"మన ఫోటోల్లాంటి ఫోటోలు ఎటూ వుండవు. కాబట్టి మనం భయపడాల్సింది లేదు" అంది డెల్లా.

"అవును." నాకో ఆశారేఖ కనుపించింది.

ఉన్న ఒక్క బెడ్ పైనే ఇద్దరం పడుకున్నాం. డెల్లా త్వరగానే నిద్రపోయింది. నాకు మాత్రం కునుకు రాలేదు. ఏం జరగబోతుందాన్న ఆతృతతోపాటు; లక్ష ఆలోచనలు కూడా రాసాగాయి. బొంబాయి గుర్తొచ్చింది. అక్కడి నా జీవితం, దాన్నుండి పారిపోయి రావడం మొదలైనవన్నీ సినిమా బొమ్మల్లా కళ్ళ ముందు చకచక తిరగనారంభించాయి.

నిద్ర వచ్చే సూచనలు కనుపించలేదు.

లేచి కూర్చున్నాను.

సిగరెట్ ముట్టించాను. కిటికీకి బిగించిన అద్దంలోంచి చూడసాగాను. నల్లటి నీళ్ళు తప్ప మరేం కనుపించలేదు.

అప్పుడప్పుడూ పెద్దపెద్ద చేపలు, పాములు, మొదలైన జలచరాలు, కిటికీకి అమర్చిన అభ్రకం షీటుకు మోదుకుంటు న్నాయి. అవి నోరు తెరిచి కిటికీపై వస్తుంటే, నాతల దాని నోట్లో ఇరుక్కున్నట్టుగానే వుంది. అలా ఎంతసేపు వారిని చూసినా విసుగుపుట్టలేదు. చాలా ఎక్సయిటింగ్ గా వుంది. దగ్గరలోనే పడుకున్న డెల్లాకాని, ప్రయాణం చేస్తున్న సబ్ మెరైన్ గానీ, నాకు గుర్తురాలేదు.

కళ్ళు నొప్పులు పుట్టినట్లయింది. ఓమారు అరచేతుల్తో అదిమి రుద్దుకున్నాను. క్రిందికి చూశాను. సిగరెట్ పీకలు కుప్పగా పడివున్నాయి. వాటిప్రక్కన రెండు ఖాళీ పాకెట్లు కూడా వున్నాయి

తలుపు దబదబ తట్టిన శబ్దమయింది.

లేచివెళ్ళి లోపలున్న గొళ్ళెం తీశాను. డెల్లా నిద్ర పోతూనే వుంది. తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా షివర్లీ నిలుచుని వున్నాడు.

"కమ్ విత్ మీ!" అన్నాడు.

"డెల్లా నిద్రపోతూంది" అన్నాను.

"నువ్వు రా! చాలు!" అన్నాడు షివర్లీ.

అతనివెంట పైభాగంలో వున్న గదికి నడిచాను.

అతని గదిలోకి వెళ్ళాం ఇద్దరం. కూర్చోమన్నాడు తను కూర్చుంటూ.

ఎదురుగా కూర్చున్నాను.

"నువ్వు ఏదేశం తరపుగా సీక్రెట్ ఏజంటుగా పని చెయ్యటం లేదనీ, దారితప్పిన బాటసారిననీ, చెప్పావు. అవునా?"

"అవును" అన్నాను.

"నువ్వు చెప్పిన కథలో మరచిపోయిందేమైనా వుందా? ఆలోచించు" అన్నాడు షివర్లీ.

"లేదు! మొత్తం చెప్పాను" అన్నాను.

అలా అంటూంటే గుర్తొచ్చింది. ఆటంబాంబులు దాచిన రహస్య స్థావరంలో మేము కొన్నాళ్ళుండిన సంగతి చెప్పలేదని. ఆ విషయం కావాలనే చెప్పలేదు నేను. దానివల్ల మంచికన్నా, చెడే ఎక్కువ జరుగుతుందని అనుమానించాను. ఒకవేళ దానిసంగతి తెలిసిందేమో షివర్లీ కనిపించింది. ఇప్పుడు తిరిగి చెప్తే నా మీదున్న అనుమానం ఎక్కువయ్యే అవకాశం వుంది. అందుకని పాతకథకే అంటిపెట్టుకుని వుండటం శ్రేయోదాయకమని పించింది.

"ఆలోచించుకుని మరీ చెప్పు" అన్నాడు షివర్లీ.

డెల్లా వెంట లేకపోవడం నాకు అధైర్యంగా వుంది. ఇలాంటి సమయాల్లో ఆమె చాకచక్యంగా మాట్లాడు తుంది. కొంచెంసేపు మౌనంగా ఎటో చూస్తున్నట్లు కూర్చున్నాను.

"అంతా చెప్పాను. ఏం మరచిపోలేదు!" అన్నాను ధైర్యంగా.

"మీ ఫొటోలు మా బాస్‌కు పంపాను. మీగురించి చాలా సమాచారం పంపారు వాళ్ళు. మీ రిద్దరూ దాదాపు రెండు మాసాల క్రితం, మేము ఆటంబాంబులు దాచి వుంచిన ద్వీపంలో దిగారు. అక్కడ బందీలుగా వున్నారు. చాకచక్యంగా తప్పించుకొని వెళ్ళిపోయారు. అప్పుడే మీగురించి అన్నివివరాలు మా సైనిక స్థావరాలన్నింటికీ పంపారు. మీకోసం చాలామంది వెతకుతున్నారు. మా

అదృష్టంవల్ల మీాకైమీారే వచ్చి చిక్కారు.'' అన్నాడు షివర్లీ.

నేనేం మాట్లాడలేదు.

''నేను చెప్పింది నిజం కాదా?'' అడిగాడు షివర్లీ కోపంగా అతని చేతిలో వెండిపన్ను వేసిన పొడవుపాటి పేము బెత్తం వుంది. దాన్ని గాలిలో గిర్రున త్రిప్ప సాగాడు.

నేను మౌనంగా చూడసాగాను.

''కాదు! అది అబద్ధం. మేము అలాంటి ప్రదేశం వెళ్ళ లేదు'' అన్నాను.

ఆమాట పూర్తికాకముందే బెత్తానికున్న వెండిపన్ను నా నుదుటికి తగిలింది. దాని తాకిడికి మెదడులోని నరా లన్నీ కదలిపోయాయి. మెరుపులు మెరిసినట్లయింది. వెంటనే అంతా చీకటిగా తోచింది.

మళ్ళా కళ్ళు తెరిచేసరికి ప్రక్కనే డెల్లా కూర్చుని వుంది. ఆమె చూపులు నావైపే కేంద్రీకరించి వున్నాయి.

టవలు నీళ్ళలో తడిపి కళ్ళు తుడిచింది.

లేచి కూర్చున్నాను.

''ఎలావుంది?'' అడిగింది.

''తలంతా దిమ్ముగా వుంది'' అన్నాను.

''షివర్లీ బాగా కొట్టాడా?''

''లేదు. ఒకేదెబ్బ వేశాడు. నిన్నేమన్నా అడిగాడా?'' అడిగాను డెల్లాను.

''అడిగాడు. నిజం చెప్పాను.''

''విన్నాక ఏమన్నాడు?''

''ముందెందుకు చెప్పలేదని అడిగాడు. అసలే మమ్మల్ను ఏజంట్లని అనుమానపడుతున్నారు మీారు. అందుకని భయ

పడ్డామని చెప్పాను. నన్ను కొట్టలేదు. కాని మనం ఏజంట్లు కాదని మాత్రం నమ్మడంలేదు. మనచేత నిజం చెప్పించేందుకు అవసరమైన సామగ్రి ఇక్కడ లేదట. అందువల్ల బేస్‌కు చేరుస్తాననీ, అంతా వాళ్ళే చూసుకుంటారని అన్నాడు'' అంది డెల్లా.

''నిజం! నిజం! నిజమంటే ఏంది. మనకు తెలిసిందా? వాళ్ళకు కావలసిన నిజం చెప్పేదాకా చంపుతారు. అది అబద్ధమని తెలిసీ ఎలా చెప్పడం'' అన్నాను వాళ్ళ నిర్హేతుకరమైన ధృక్పధాన్ని తిట్టుకొంటూ.

''అనుమానమన్నది పెనుభూతం లాంటిది. మనమే ఇచ్చాం వాళ్ళకు ఆ అవకాశం. మన ఫోటోలు బేస్‌లో వున్నాయట. ఇక్కడ్నుంచి రేడియోద్వారా ట్రాన్సిమిట్ చెయ్యగానే, వాళ్ళు సంతోషించి వెంటనే వివరాలు పంపారు. అర్థంకానిదల్లా ఇండియన్ ఎలా ఏజెంటుగా పనిచేస్తున్నాడనేదే! అందుకే నీ బ్యాగ్రౌండ్ గురించి సమాచారం సేకరించేందుకు ఇండియాలో వాళ్ళ గూఢచారులు పని ప్రారంభించారట. మరో ఇరవై నాలుగు గంటలలో అవసరమైన అన్ని వివరాలు సేకరించుకు రాగలరని చెప్పాడు షివర్లీ'' అంది డెల్లా.

బేస్‌కు చేరాక మమ్మల్ని వాళ్ళు పెట్టబోయే చిత్రహింసలు, ఊహిస్తూ కూర్చున్నాను. సగం ప్రాణాలు ఇక్కడే పోయాయి. మిగిలిన సగం పోవటానికి ఎంతో టయిమ్ అవసరం లేదనిపించింది.

''ఈ సబ్‌మెరైన్‌లోంచి తప్పించుకునే మార్గమేమయినా వుందా?'' అడిగాను.

లేదన్నట్లు తలూపింది డెల్లా.

ఆమె చెప్పకున్నాం. నాకు తెలుసు. అందర్నీ చంపితే తప్ప వెలుపలకుపోవటం వీలుగాదు. అందరూ తర్ఫీదు పొందిన సైనికులు. పైగా సబ్ మెరైన్ కంట్రోలువద్ద నలుగురున్నారు. అందర్నీ చంపాక ఎలా నడపాలో కూడా తెలీదు మాకు.

"ఈ కిటికీ చూశావా?" అడిగాను డెల్లాను.

"ఆఁ!" అంది.

"దీనికున్న మైకా షీటు బ్రద్దలుకొడితే నీళ్ళు లోపలికి వస్తాయి. దెబ్బతో సబ్ మెరైన్ మునిగిపోతుంది. వాళ్ళూ, మనమూ అందరం ఛస్తాం. చచ్చే ముందు కనీసం కొంత స్వేచ్ఛ సంపాదించుకున్నట్లనా్న వుంటుంది ఏమంటావ్?" అడిగాను.

"బాగానే వుంటుంది. కానీ అది మనకు సాధ్యమా?" అనుమానంగా నా వైపు చూస్తూ అంది డెల్లా.

"ప్రయత్నిద్దాం!" అన్నాను.

డెల్లా మారు మాటడకుండా కూర్చుంది.

(సశేషం)